


అల్లూరి సీతారామరాజు

నేటి 'మీ కోసం'లో విపత్తుల ఫిర్యాదులకు ప్రత్యేక కౌంటర్

-జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : ఈనెల 25న శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో యధావిధిగా మీకోసం కార్యక్రమం ఉంటుందని, అందులో ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించడానికి ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్‌గా అందే ఫిర్యాదులతో పాటు విపత్తులకు సంబంధించిన ఫిర్యాదులు కూడా ప్రత్యేకంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. విపత్తులకు సంబంధించిన ఫిర్యాదులను ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లో మాత్రమే అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులు గమనించి విపత్తులకు సంబంధించిన ఫిర్యాదుల కౌంటర్ వినియోగించుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

- డయేరియాపై ముందస్తు చర్యలు అవసరం
- పకడ్బందీగా క్లోరినేషన్ ప్రక్రియ
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత
- సమస్యలపై ప్రశ్నలు సంధించిన జెడ్‌పిటిసి సభ్యులు



జెడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. డయేరియాలాంటి మహమ్మారి దాడి చేయకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను తరచూ శుభ్రం చేయాలని, క్లోరినేషన్ ప్రక్రియను నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అందరం కలిసికట్టుగా నడవాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో అనిత ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మురుగు కాలువలకు ఆనుకొని తాగునీటి పైపు లైన్లు ఏర్పాటు చేయరాదని, జలజీవన్ మిషన్‌లో భాగంగా చేపట్టిన పనులను నిర్ణీత కాలంలో శత శాతం పూర్తి చేయాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, శివారు గ్రామాలకు వెళ్లే పరిస్థితి లేదని పలువురు సభ్యులు ప్రస్తావించగా స్పందించిన హోం మంత్రి రోడ్ల అభివృద్ధికి సభ్యుల సలహాలు, సూచనలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాల్సి ఉందన్నారు. ఇప్పటికే దీనిపై కేంద్ర హోం మంత్రితో చర్చించామని కేంద్ర, రాష్ట్ర నిధుల సహాయంతో గిరిజన ప్రాంతాల్లో రోడ్లను పూర్తి స్థాయిలో అభివద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. అప్పుడే డోలీ మోత కష్టాల నుంచి విముక్తి కలుగుతుందని అన్నారు. మైదాన ప్రాంతాల్లో కూడా రోడ్ల మరమ్మతులకు తక్షణ చర్యలు చేపడతామని ఆమె అన్నారు. వర్షాకాలంలో కాలువ గట్ల పటిష్టతకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉందని సంబంధిత అధికారులను ఉద్దేశించి పేర్కొన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు వల్ల ఎన్నో దుష్ప్రయోజనాలు కలుగుతున్నాయని, ఆ పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఉచిత ఇసుక విధానం అమలులో పారదర్శకంగా ఉంటామని, ప్రజలకు సహకరిస్తామని అన్నారు.

జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా సిఇఒ పి.నారాయణమూర్తి అజెండా అంశాలను చదివి వినిపించారు. ఆయా శాఖల పరిధిలో చేపట్టిన పనులు, తీసుకున్న నిర్ణయాల గురించి సంబంధిత అధికారులు వివరించారు. సభ్యులు పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని బాగా అమలు చేయాలని, ప్రయివేటు పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని, పిల్లల భద్రతకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలో భారీగా పంట నష్టం జరిగిందని, పారదర్శకంగా అంచనాలు వేసి పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. ఉపాధి హామీ, కల్వర్టుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, జలజీవన్ మిషన్ పనులు తదితర అంశాలపై సభ్యులు మాట్లాడారు.

స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా స్పందిస్తాం : విశాఖ ఎంపీ శ్రీభరత్

సమావేశంలో భాగంగా స్టీల్‌ప్లాంట్ విషయంలో స్థానిక ఎంపీ పార్లమెంటులో ప్రస్తావించాలని, న్యాయం చేయాలని ఓ సభ్యుడు విన్నవించగా ఎంపీ శ్రీభరత్ స్పందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గడిచిన నాలుగు నెలల కాలంలో రూ.500 కోట్లు ఒకసారి, రూ.1200 కోట్లు మరోసారి మొత్తం రూ.1,700 కోట్ల నిధులు వేర్వేరు అవసరాల దృష్ట్యా విడుదలయ్యాయన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే స్థానికంగా స్పందిస్తామని ఆయన అన్నారు.

ఆహార నాణ్యత పెరగాలి : అరకు ఎంపీ డాక్టర్ తనూజ రాణి

సమావేశంలో అరకు ఎంపీ డాక్టర్ తనూజ రాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాల్లో అందించే ఆహారం నాణ్యతను మరింత పెంచాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగు పరచాలన్నారు. శిథిల భవనాలకు మరమ్మతులు చేయాలని, కొత్తవాటిని నిర్మించాలని, గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలని సూచించారు.

ఇటీవల కురిసిన వర్షాలకు జికె.వీధి మండలంలోని చట్రాపల్లిలో భారీ నష్టం జరిగిందని, అక్కడి ప్రజలు ఇళ్లు కోల్పోయారని స్థానిక జెడ్‌పిటిసి సభ్యులు ప్రస్తావించగా అల్లూరి సీతారాజుజిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ఇటీవల ఆ ప్రాంతాన్ని సందర్శించానని, అక్కడి పరిస్థితులను పరిశీలించానని చెప్పారు. చట్రాపల్లి గ్రామంలోని 37 కుటుంబాలను అనుకూలమైన ప్రాంతానికి తరలించి వారి కోసం పిఎం ఆవాస్ యోజన పథకం కింద మోడల్ కాలనీని నిర్మిస్తామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు ఎంఎన్.హరేంధిర ప్రసాద్, దినేష్ కుమార్, విజయకృష్ణన్, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అన్ని జిల్లాలకూ నిధులిచ్చి / అల్లూరి జిల్లాను విస్మరించడం తగదు

జెడ్‌పి సమావేశంలో అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ధ్వజం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో 26 జిల్లాలు ఉండగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా 25 జిల్లాలకు రూ.2712.50 కోట్లు కేటాయించారని, ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాను మాత్రం దీనిలో మినహాయించారని, అలా ఎందుకు జరిగిందని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ప్రశ్నించారు. గురువారం జరిగిన జెడ్‌పి సమావేశంలో హోం శాఖ మంత్రి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినట్లు ప్రకటించారు. దీనికి స్పందించిన గంగరాజు మాట్లాడుతూ మంత్రి అనిత అల్లూరి జిల్లాకు నిధులు కేటాయింపు జరగని సంగతిని విస్మరించారని అన్నారు. పూర్తిగా గిరిజనులు నివసిస్తున్న, అత్యంత వెనుకబడిన జిల్లా అల్లూరి జిల్లా అని తెలిపారు. గిరిజనుల పట్ల వివక్షత తగదన్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరుకు కృషి చేయాలని కోరారు. రోజువారి డోలీ మోతల వార్తలు పత్రికల్లో, టీవీల్లో వస్తున్నాయని, అవి కనబడలేదా ? అని ప్రశ్నించారు. అల్లూరి జిల్లాకు ముందుగా నిధులు ఇచ్చి ప్రజా ప్రతినిధులు మాట్లాడటం మంచిదన్నారు. ఏజెన్సీలో గంజాయి రవాణా పెరుగుతోందని, గిరిజన యువత కేసుల్లో ఇరుక్కుని విశాఖ సెంట్రల్ జైల్లో నలుగుతున్నారని తెలిపారు. గంజాయికి మాత్రం ధర ఉంటుందని, గిరిజనులు పండించే కాఫీ పంటకు మాత్రం గిరాకీ ఉండదని అన్నారు. ప్రధాని మోడీ అరకు కాఫీ తాగి, అరకు కాఫీ నెంబర్ వన్ అని ప్రశంసించినా ధర మాత్రం పెంచలేదన్నారు. కాపీ కేజీ ధర రూ.285 మాత్రమే ఉందన్నారు. గిరిజనులు పండించే ఈ వాణిజ్య పంటకు ఎందుకు గిట్టుబాటు ధర ఇవడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాఫీ ధరను రూ.500కు పెంచాలన్నారు. అలాగే మిరియాలు కేజీ రూ.1000కి కొనుగోలు చేయాలని కోరారు. ఏజెన్సీలో రోడ్లకు నిధులు కేటాయించాలన్నారు. జికె వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లిలో గత నెల తుపానులో కొట్టుకుపోయి మరణించిన కొర్ర కుమారి బాధిత కుటుంబానికి నేటి వరకు నష్టపరిహారం చెల్లించలేదని తెలిపారు. తక్షణం పరిహారం అందించాలన్నారు. అనంతగిరి మండలం గుమ్మకోట ఎపిఆర్ పాఠశాలలో ప్రిన్సిపాల్ తీరు బాగోలేదని, సమన్వయం లేక అక్కడ సిబ్బంది మధ్య కొట్లాటలు జరుగుతున్నాయని, క్రమశిక్షణ లోపించి పిల్లలపై ప్రభావం పడుతోందని సభ దృష్టికి తెచ్చారు. 18 సంవత్సరాలుగా ఉన్న ఉపాధ్యాయున్ని, ప్రిన్సిపాల్‌ని వేరే చోటుకు బదిలీ చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్‌ను ఆయన కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ ఎఎన్ఎమ్‌లను నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అతిపెద్ద కర్మాగారం విశాఖ స్టీల్‌ప్లాంట్ అని, దీనిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.




పోడియం వద్దకు వెళ్లి సమస్యలపై ప్రశ్నిస్తున్న సిసిఎం జెడ్‌పిటిసి గంగరాజు

అయ్యవార్లకు గుడ్డు పై .. విద్యార్థులకు నీళ్ల సాంబారు, బంగాళాదుంప

అటకెక్కిన భోజన మెనూ!

- సొవ్వ గిరిజన ఆశ్రమ హాస్టల్‌లో భోజన అమలు తీరిది!
- అధికారుల పర్యవేక్షణా లోపమే కారణమని ఆరోపణలు







ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజన ఆశ్రమ పాఠశాల వసతిగృహంలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాల్సిన పాఠశాల యాజమాన్యం నాసిరకం భోజనాన్ని పెడుతూ, అయ్యావార్లకు మాత్రం ప్రత్యేక ఆహార పదార్థాలను అందిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. మెనూ ప్రకారం విద్యార్థులకు పెట్టాల్సిన పౌష్టికాహారాన్ని సక్రమంగా పెట్టడం లేదనే ఆరోపణలున్నాయి.

మండలంలోని సొవ్వా గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థులకు పెట్టాల్సిన భోజన మెనూను గాలికొదిలేసి, గురువారం మధ్యాహ్నం ఉపాధ్యాయులు గుడ్‌ఫ్రై కూర వండుకుని , విద్యార్థులకు బంగాళదుంప కూర్చ రుచి, పచి లేని సాంబార్‌తో భోజనాలు పెట్టడమే ఇందుకు నిదర్శనం. ఆ పాఠశాలలో ఉపాధ్యాయులు గుడ్లును రుచికరంగా వేపుళ్లతో వంటకాలు చేసి ఆరగించగా, విద్యార్థులకు పాలకూర పప్పుతో పాటు సాంబార్‌తో పెట్టాల్సి ఉండగా, బంగాళదుంప బఠానీ కూర, నీళ్లను పోలిన నాసిరకం సాంబార్‌తో భోజనాలు పెట్టారని అంటున్నారు. మెనూ అమలుతీరుపై అధికారులు దృష్టి సారించకపోవడం వల్లే గిరిజన ఆశ్రమాల్లో భోజన మెనూ అటకెక్కి, విద్యార్థులకు మొక్కుబడి భోజనాలను పెడుతున్నారని పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తక్షణమే సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి సొవ్వ ఆశ్రమ పాఠశాలలో భోజన మెనూ సక్రమంగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సొవ్వ పాఠశాలలో ఇది చోటుచేసుకున్నా, దాదాపు అన్ని గిరిజన ఆశ్రమాల్లో ఇదే పరిస్థితి ఉందని అంటున్నారు.

పూనెం సత్యనారాయణకు కన్నీటి వీడ్కోలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సహా పలువురు నివాళి
- రేఖపల్లి నుండి నూతిగూడెం వరకు అంతిమ యాత్ర
- అభిమాన నేతను కడసారి చూసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజానీకం




సంతాప సభలో మౌనం పాటిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు

ప్రజాశక్తి-విఆర్.పురం

గుండెపోటుతో బుధవారం హఠాన్మరణం చెందిన సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు, పెద్దమట్టపల్లి మాజీ సర్పంచ్ పూనెం సత్యనారాయణకు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మండల ప్రజలు గురువారం కన్నీటి వీడ్కోలు పలికారు. రేఖపల్లిలో సత్యనారాయణ పార్థివ దేహానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సహా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నేతలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో పూనెం సత్యనారాయణ ప్రజలకు, పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. సంతాప సభ అనంతరం అశేష జనవాహిని నడుమ సత్యనారాయణ అంతిమ యాత్ర రేఖపల్లి నుంచి నూతిగూడెం వరకు సాగింది. తమ అభిమాన నేతను కడసారి చూసేందుకు మండలంలోని అన్ని గ్రామాల నుండి జనం భారీగా తరలివచ్చారు. సత్యనారాయణ పార్థివదేహం వద్ద కన్నీటిపర్యంతమయ్యారు. నూతిగూడెంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, సిఐటియు ఎపి రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, నాయకులు మేకల నాగేశ్వరరావు, ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు ఎజె.రమేష్, గడ్డం స్వామి, బండారు శరత్, ఎంబి నరసారెడ్డి, ఎఐటియుసి తెలంగాణ నాయకులు సిహెచ్.సీతామహాలక్ష్మి, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు సోడి నాగేశ్వరరావు, జల్లి బాబురావు, సున్నం రాజులు, పూసం రామారావు, సిఐటియు నాయకులు సున్నం రంగమ్మ, రాజేశ్వరి, మాజీ ఎంపీపీ నాగమ్మ, సర్పంచ్‌లు కారం బుచ్చమ్మ, వెట్టి లక్ష్మి, పులి సంతోష్ కుమార్, సవలం మారయ్య, సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, సోడి మల్లయ్య, కారం సుందరయ్య, కారం సత్తిబాబు, పులి బొజ్జి, ఆసు లక్ష్మయ్య, వడ్లది రమేష్, పండా వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పులి ధర్మరాజు, దూలయ్య, కమ్మచిచ్చు సత్యనారాయణ, ఆత్మకూరు కాంతారావు, తాతాబాబు, రెడ్డి ప్రకాశరావు, గుండెపూడి లక్ష్మణరావు, కుంజ కన్నయ్య, పూసం రవివర్మ, గొంది సారయ్య, తొడం రాజు, పులి సీతమ్మ నెర్రబోయిన రాజు పాల్గొన్నారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు



సత్యనారాయణ అంతిమ యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు, పార్టీ శ్రేణులు,



పూనెం పార్థివదేహం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ తదితరుల నివాళి

ఏడాదికి పైగా ఉపాధ్యాయులు లేరు

- కొమ్ములవాడ పాఠశాల ఎదుట తల్లిదండ్రులు, విద్యార్థుల నిరసన
- తమ చిన్నారులకు విద్యాభ్యాసం సాగడం లేదని ఆవేదన
- తక్షణమే టీచర్‌ను నియమించాలని డిమాండ్



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ కొమ్ములవాడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది జులై నుంచి ఉపాధ్యాయులు లేరు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుని బదిలీ చేయగా, ఆ స్థానంలో మరో ఉపాధ్యాయుని ఇప్పటి వరకు అధికారులు నియమించలేదు. దీంతో 38 మంది గిరిజన చిన్నారులకు ఏడాదికి పైగా విద్య అందడం లేదు. ఉపాధ్యాయులను నియమించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు స్పందించకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో గురువారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు కలిసి పాఠశాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 38 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ప్రభుత్వం గతేడాది జులై నుండి ఉపాధ్యాయులను నియమించకపోవడంతో తమ పిల్లలు విద్యాభ్యాసానికి దూరమయ్యారని, వారి జీవితాలు అంధకారంలోకి నెట్టబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం పదేపదే ప్రకటనలు చేస్తుందే తప్ప ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదని ఆరోపించారు. తమ పిల్లలు భవిష్యత్తు నాశనం చేస్తున్న ప్రభుత్వం, అధికార యంత్రాంగం నశించాలని శాపనార్థలు పెట్టారు. ఉపాధ్యాయులను తక్షణమే నియమించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వెంటనే పాడేరు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఐటిడిఎ పిఓ అభిషేక్ స్పందించి ఉపాధ్యాయులను నియమించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గురుకుల కళాశాలలో అక్రమంగా బియ్యం నిల్వ

- ఎంపీపీ తనిఖీలో బయటపడ్డ వైనం.
- బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్న డీడీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

స్థానిక గురుకుల కళాశాలలో పిల్లలకు వండి పెట్టాల్సిన బియ్యం పక్కదారి పడుతున్నట్లు ప్రజాప్రతినిధులు గుర్తించారు. స్థానిక గురుకుల బాలికల కళాశాలను గురువారం స్థానిక ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సుమారు 1700 కేజీల బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడాన్ని గమనించారు. ఈ బియ్యం ఎందుకు నిలువ చేశారని ప్రిన్సిపల్‌ను ఎంపీపీ ప్రశ్నించగా పక్కదారే పేట్టే ప్రయత్నం చేశారు. నిలువ చేసిన బస్తాలను తుప్పల్లో పడవేయడాన్ని గమనించిన ఎంపీపీ ప్రిన్సిపల్‌ని నిలదీశారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి కళాశాలను పర్యవేక్షించారు. కళాశాలలో విచారణ నిర్వహించారు. విజయదశమి సెలవులు ముందే కళాశాల సిబ్బందితో బియ్యం వేరే గదిలోకి పెట్టించునట్లు విద్యార్థులు తెలిపారు. ఈ నెలలో ఉండాల్సిన స్టాక్ కాకుండా అదనంగా 1700 కేజీలు బరువు ఉండే 34 బస్తాలు బియ్యం, అలాగే 10 కేజీలు చింతపండు అక్రమంగా నిలువ ఉంచినట్లు విచారణలో తేటతల్లమైందని డిడి విజయశాంతి పేర్కొన్నారు. విషయం రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలియజేయడం జరిగిందని, ఉన్నతాధికారులకు నివేదికలు అందజేసి విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిడి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నేత సురేంద్ర

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

-సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి- పెదబయలు: ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర మండిపడ్డారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించి, ఉద్యమాలకు సన్నద్ధం చేసేందుకు వచ్చేనెల 8 నుంచి 15 వరకు సిపిఎం చేపడుతున్న దేశవ్యాప్త ఆందోళనల్లో భాగంగా మండల కేంద్రాల్లో ధర్నాలు, నిరసనలు రాస్తారోకోలు, చేయాలని పిలుపునిచ్చారు. గురువారం పెదబయలు మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేంద్రతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జమిలి ఎన్నికలకు ఉబలాటపడుతోందని,దీనికి సిపిఎం పూర్తిగా వ్యతిరేకమని స్పష్టం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో అధికారంలో వచ్చినప్పటి నుంచి దేశవ్యాప్తంగా గిరిజనులు, దళితులు, మైనార్టీలపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, హింస విపరీతంగా పెరిగిపోయిందని, వీటిని నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.దేశంలోని ప్రభుత్వ సంస్థలన్నింటినీ, ఆదానీ, అంబానీలకు గుత్తాధిపత్యంగా కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపించారు విశాఖస్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులంతా దాదాపు నాలుగేళ్లుగా ఆందోళన చేస్తున్నా వెనక్కుతగ్గకుండా మొండిగా ముందుకు వెళ్లడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఏజెన్సీలోని గిరిజన నిరుద్యోగులకు వందశాతం ఉద్యోగాలు కల్పించే జిఒ3 ప్రయోజనాలను పునరుద్ధరించాలని వేడుకుంటున్నా స్పందన లేదన్నారు. ఈనెల 29న పెదబయలులో నిర్వహించనున్న సిపిఎం మండల కమిటీ సమావేశంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల గిరిజన, ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ చేయబోతున్నామని స్పష్టం చేశారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు మండల కమిటీ సభ్యులు బొండా గంగాధరం, సర్బన్న, బుజ్జిబాబు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని జాకరగుడ గ్రామంలో తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగిలించినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న స్థానిక సర్పంచ్ పి కొములు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు, ఎస్ఐకి సమాచారం అందించినట్లు తెలిపారు. ఇక్కడే కాకుండా మూడు వారాల క్రితం గతర జిల్లేడ గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల చోరీపై పోలీసు అధికారులు దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కొమ్ములు కోరారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయండి

- ధరాభారంపై వచ్చే నెల 9 నుంచి సిపిఎం ప్రజాహోరు
- ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స



జెండా ఆవిష్కరిస్తున్న కొండమ్మ

ప్రజాశక్తి- పాడేరు: సిపిఎం అల్లూరి జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స పిలుపు నిచ్చారు. గురువారం మోదపల్లి కమ్యూనిటీ హాల్‌లో పార్టీ పాడేరు మండల 7వ మహాసభ ఘనంగా నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా పార్టీ సీనియర్ సభ్యులు కొండమ్మ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అప్పల నరస మాట్లాడుతూ అల్లూరి జిల్లా కమిటీ ప్రథమ మహాసభ డిసెంబరు 2నుండి 5 వరకు పాడేరు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నామన్నారు. . జిల్లా వ్యాప్తంగా సుమారు 5వందల మంది ముఖ్య నాయకులకు ప్రతినిధులుగా ఈ మహాసభకు రానున్నారని తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధి, జిఒ 3 రిజర్వేషన్ సాధన, కాఫీ రైతులు గిట్టుబాటు ధరలు , కార్మికుల కూలీ రేట్లు, పివిటిజి సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయడం, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై జిల్లా మహాసభలో ప్రణాళిక రూపొందిస్తామన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం పరిపాలన గత ప్రభుత్వానికి భిన్నంగా లేదని, ఇసుక ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి అంటుతున్నాయన్నారు. విద్యుత్ చార్జీలు భారం తగ్గలేదన్నారు..నూతన జిల్లా ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణపనులకు శంకుస్థాపన కార్యక్రమం కూడా చేపట్టలేదని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అధిక ధర తగ్గించాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రయివేటుపరం చేయరాదన్న పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ప్రజాహోరు పేరిట వచ్చేనెల 9 నుండి 15 వరకు ప్రచార కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యాప్తంగా పంచాయితీ, గ్రామ స్థాయి లో ముఖ్యమైన నాయకులు, కార్యకర్తలు 100 మంది పాల్గొన్నారు..

సిపిఎం మండల కార్యదర్శిగా సుందరరావు

పాడేరు మండల 7వ మహాసభలో నూతన మండల కమిటీని 13 మందితో ఏర్పాటు చేశారు. ఎన్నికల పరిశీలకునిగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె. సురేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్ష వర్గంగా పి లక్కు, ఎస్. చిట్టిబాబు, కె.సత్యనారాయణ,కాంతమ్మ వ్యవహరించారు. పార్టీ మండల కార్యదర్శి గా ఎల్. సుందరరావును రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా పాలిక లక్కు. సోమేలి చిట్టిబాబు, కిల్లో సత్యనారాయణ, డూరు బొజ్జన్న., జె .ఆనంద్‌రాజు, ఎస్.నాగరాజు,. ప్రసాద్, .పి.జీవన్.రాజు,.కాంతమ్మ, సూర్యకుమారి, వరలక్ష్మి నియమితులయ్యారు.

మ్యుటేషన్‌లో వసూళ్లకు పాల్పడితే సస్పెన్షన్!

- నోటరీ అఫిడవిట్లు అక్కరలేదని స్పష్టీకరణ
- 30రోజుల్లో మ్యుటేషన్ దరఖాస్తు పరిష్కరించాలి
- జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన భూములకు మ్యుటేషన్ల ప్రక్రియ నిర్దిష్టమైన గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ్ ఆదేశించారు. మ్యుటేషన్ చేయడానికి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో పాడేరు డివిజన్ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల నుండి మ్యుటేషన్లకు నోటరీ అఫిడవిట్లు తీసుకోవలసిన అవసరం లేదని స్పష్టం చేసారు. నోటరీ అడుగుతున్నారని ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మ్యుటేషన్ సర్వేకు వెళ్లినపుడు భూయజమానులు ఎవరు? ప్రస్తుతం భూమిపై ఎవరు సాగులో ఉన్నారని పరిశీలించాలని సూచించారు సమాచారం పూర్తిగా సేకరించి విఆర్ఒ లాగిన్ నుంచి ఎంఆర్ఐ లాగిన్‌కు అక్కడి నుంచి తహశీల్దార్ లాగిన్‌కు పంపించి 30 రోజులలోగా మ్యుటేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. విఆర్ఒల రిపోర్టు మేరకు మ్యుటేషన్ జరగాలని స్పష్టం చేసారు. తాహశీల్దారుల లాగిన్లో 275 ముటేషన్లు పెండింగ్లో ఉన్నాయన్నారు. అదేవిధంగా విఆర్ఒల లాగిన్ లో 84 ఉన్నాయని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

లబ్ధిదారులకు సకాలంలో రేషన్ పంపిణీ

గిరిజన ప్రాంతంలో పేదలకు రేషన్ చాలా ముఖ్యమని, రేషన్ పంపిణీలో జాప్యం లేకుండా సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు. తాహశీల్దారులు రేషన్ షాపులు, ఎంఎల్ఎస్ పాయింట్లను తనిఖీ చేసి రేషన్ సక్రమంగా పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. రేషన్ పంపిణీకి విఆర్ఒలు సమయానికి అథెంటికేషన్ వేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రేషన్ డీలర్ల ఖాళీలు ఉంటే ప్రతిపాదనలు పంపిస్తే భర్తీ చేస్తామన్నారు. రేషన్ బియ్యం ఎక్కడైనా పక్కదారి పడితే సంబంధిత సిబ్బందిని ఉద్యోగాల నుండి తొలగిస్తామని హెచ్చరించారు. ఎండియు ఆపరేటర్లను తనిఖీ చేయాలని తాహశీల్దారులకు సూచించారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ రెవెన్యూ అధికారులదే

భూముల సర్వే సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న సర్వే ఫొటోలను సేకరించి తాహశీల్దారు గ్రూపులో పొందుపరచాలన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉందన్నారు. ప్రభుత్వ భూములు, బంజరు భూములు అన్యాక్రాంతం జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. మీ కోసంలో స్వీకరించిన ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.సెల్ టవర్ల నిర్మాణాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయని, సెల్‌టవర్ల వలన రేడియేషన్ ఉండదని జియో అధికారి సత్యా తెలిపారు. సమావేశంలో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిఆర్ఒ. బి. పద్మావతి, పిఎంయు ప్రోగ్రాం అధికారి రాంగోపాల్, 11 మండలాల తాహశీల్దారులు, డిప్యూటీ తాహశీల్దారులు, ఎంఆర్ఐలు, విఆర్ఒలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలులో విఫలం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని స్థానిక మండల వైస్ ఎంపిపి ఎస్ ఆనంద్, వైసిపి నాయకులు బి సింహాచలం, పి అశోక్ ఆరోపించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు పైబడుతున్న ఇప్పటివరకు ఒక్క పింఛన్ల పెంపు తప్ప మిగతా మరే పథకాలు అమలు చేయడం లేదన్నారు. పథకాలు అమలు చేయకుండా ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుంటే ప్రజల తరపున వైసిపి ప్రశ్నిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గణపతి పాల్గొన్నారు.

అర్హులకు ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న సిపిఎం నేత త్రినాథ్

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు ఆర్ఒఎఫ్ఆర్ సాగుహక్కు పట్టాలను మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొర్ర త్రినాథ్, మండల కమిటీ కార్యదర్శి పాంగి భీమరాజు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో శాఖ కార్యదర్శి ఎంఎం.శ్రీను ఆధ్వర్యంలో శాఖ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన గ్రామాల్లో అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేయాలని, ప్రతి ఇంటికీ రూ.6లక్షలు నిధులు కేటాయించాలని కోరారు. గ్రామాల్లో సిసి, తారురోడ్డు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో అర్హులకు జాబ్ కార్డులు మంజూరు చేయాలని, కుటుంబానికి 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిఒ 3ను పునరుద్ధరించాలని, గిరిజన ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి, వందశాతం ఉద్యోగాలను స్థానిక గిరిజన యువతతో భర్తీ చేయాలని కోరారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధి పొందడమెలాగో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెటియాల రామదాసు, కిల్లో బిమో, బాలరాజు, గంపరాయి కోటిబాబు, పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని డెయిరీ గ్రామంలో పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత ప్రత్యేక చొరవతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 100 మీటర్లు, పంచాయతీ నిధులతో 60 మీటర్ల రహదారి నిర్మాణ పనులకు గురువారం ఎంపిటిసి దాసరి దార లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్‌వల్లి, వైసిపి నేతలు వేములపూడి పరమేష్, ముత్తా శ్రీను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ టెండూల్కర్, గ్రామ పెద్దలు మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ దురియా పుష్పలత ప్రత్యేక చొరవతో పంచాయతీలోని గ్రామాలలో రహదారుల కల్పన జరుగుతుందన్నారు. అనివార్య కారణాల వలన సర్పంచ్ పుష్పలత కార్యక్రమానికి హాజరు కానప్పటికీ ఎంతోకాలంగా అభివృద్ధికి నోచుకోని డెయిరీనగర్ గ్రామంలో రహదారి పనులు ప్రారంభానికి ఆమె ఎంతో కృషి చేశారన్నారు.కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదును జయప్రదం చేయండి

ప్రజాశక్తి -జి మాడుగుల : మండలంలో ఈనెల 26నుంచి తెలుగుదేశం సభ్యత్వ నమోదు చేపట్టాలని ఎస్‌టి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమెలి చిట్టిబాబు.అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో నాయకులు సమావేశమై, పార్టీ సభ్యత్వ నమోదుపై చర్చించారు. సభ్యత్వం తీసుకున్న వారు సాధారణ మరణం పొందితే మట్టి ఖర్చుల కింద పార్టీ రూ. 10,వేలు చెల్లిస్తుందన్నారు. అదే ప్రమాదవశాత్తు మరణిస్తే సభ్యుల కుటుంబాలకు పార్టీపరంగా ఆర్థిక అండ ఉండాలనే ఉద్దేశ్యంతో బీమా పరిహార ప్రయోజనాన్ని గతంలో ఉన్న రూ.రెండు లక్షల నుంచి ఇపుడు రూ.ఐదు లక్షలకు పెంచారన్నారు. సభ్యత్వ నమోదు రుసుము ఎప్పటిలాగానే రూ.100ఉంటుందన్నారు. సభ్యత్వ నమోదు విషయంలో నాయకులు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి సభ్యత్వ నమోదు వల్ల కలిగే మంచి కోసం ప్రజలకు వివరించాలన్నారు. 17 పంచాయతీల్లో సభ్యత్వ నమోదు గతంలో కంటే ఈసారి ఎక్కువగా చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపీటీసీలు మాతే రామారావు, గెమ్మెలి అప్పరావు, సంస్కృతిక విభాగం అధ్యక్షులు సామిరెడ్డి నాగబ్బయి, మాజీ ఎంపీటీసీ కోటా. లక్ష్మయ్య, ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు కొండపల్లి పిన్నాయ,లకే బాలయ్య దోర, వైస్ ఎంపిపి.కొర్రాజు బూత్ ఇంచార్జ్ లోచలి .మహేష్, మొట్టడం రామక్రిష్ణ, యూనిట్ ఇన్చార్జి మత్స్యరాస. నారాయణ రాజు, మాధుల బాలకష్ణ, సేవమిత్ర మాతే.కామరాజు, కొండపల్లి రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కల్పశ్రీ

దీపావళి సామగ్రి విక్రయానికి లైసెన్స్‌లు తప్పనిసరి

ప్రజాశక్తి-రంపచోడవరం : దీపావళి పండుగ నేపథ్యంలో మందుగుండు సామాన్లు అమ్మేవారికి లైసెన్సులు తప్పనిసరి ఉండాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పోలీసు అధికారులు, డిఎల్‌పిఒలు, అగ్ని మాపకశాఖ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ అన్ని మండలాల పరిధిలోని గ్రామాలలో దీపావళి సామాన్లు అమ్మేవారు తహశీల్దార్లు ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం లైసెన్సులు ఉన్న వారే అమ్మాలని, లేకుంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఊరికి చివర ఖాళీ స్థలాల్లో మందుగుండు సామగ్రి షాపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలకు తావు లేకుండా ఎక్కడికక్కడ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఎల్పిఒ రఘునందన్, తహశీల్దార్లు సూర్యారావు, కె.సత్యనారాయణ, ఎవిఎస్.సత్యనారాయణ, బాలాజీ, రామకృష్ణ, ఎంపీడీవోలు యస్.శ్రీనివాసరావు, విశ్వనాథం, శ్రీనివాస్, సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా కిశోర్ వర్మ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు ఎస్ఐగా పి.కిషోర్‌వర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన కేవీ నాగార్జున ఎటపాక మండలానికి బదిలీ అయ్యారు. కిశోర్‌వర్మ శ్రీకాకుళం జిల్లా నౌపడ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, గంజాయి, నాటుసారా తదితర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి గదబగూడ గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.22 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణం పనులను గురువారం సర్పంచ్ కేలేబు కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుత్తేదారుడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా పర్యవేక్షణ చేస్తామని చెప్పారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే గదబగూడ గ్రామానికి రహదారి సమస్య తొలగిపోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు టి.మన్మధరావు, ఎస్.రాము, బి.దాసుబాబు, ఎం.జగ్గారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - సీలేరు : రక్తహీనత రాకుండా నివారణ చర్యల్లో భాగంగా విద్యార్థులకు ఐరన్ మాత్రలు దారకొండ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది గురువారం పంపిణీ చేసి స్వయంగా మింగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఐరన్ మాత్రలు తూచా తప్పకుండా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ బివిఎం రాణి, పీహెచ్ఈఓ పోతురాజు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి-దేవీపట్నం : రంపచోడవరం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన 26 ఏళ్ల సోయం శ్రీసౌమ్య అనే యువత ఈ నెల 21 నుంచి కన్పించడం లేదని ఆమె తల్లి సోయం పార్వతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సౌమ్య దేవీపట్నం మండలం పూడిపల్లి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుంది. ఈ నెల 21న సచివాలయానికి వచ్చిన తమ కుమార్తె ఇంటికి తిరిగి రాలేదని ఆ ఫిర్యాదులో తల్లి పార్వతి పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై షరీఫ్ తెలిపారు.

రోడ్డు సౌకర్యం కోసం డోలీలతో ఆదివాసీల ప్రదర్శన



డోలీ మోతలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లోని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, గిరిజనులకు వైద్య సేవలను అందుబాటులో తేవాలని కోరుతూ గురువారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశ మందిరం ఎదుట ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ సభ్యులు కె.గోవిందరావు నేతృత్వాన గిరిజనులు డోలీలతో వినూత్న ప్రదర్శన, నిరసన తెలిపారు. రోడ్ల సదుపాయం లేకపోవడంతో గిరిజనులకు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు డోలీ మోతల ద్వారా ఆసుపత్రులకు వెళ్తున్నారని తెలియజేస్తూ వారంతా డోలీయాత్రగా జిల్లా పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి జిల్లాల పరిధిలో జాజులబంధ, పిత్రగెడ్డ, నీలబంద, దాయిత్తి గిరిజన గ్రామాలకు, కొయ్యూరు మండలం మూలపేట, రోలుగుంట మండలం పిత్రగడ్డ, నీల బంధ, పెదబుగోరు గ్రామాలను కలుపుకుంటూ ఆర్ల నుండి జాజులబంధ గ్రామానికి రూ.కోటితో గ్రావెల్ రోడ్డు 2023లో మంజూరైందని తెలిపారు. వీటిలో రూ.26 లక్షలు ఖర్చు చేసినట్లు చూపిస్తున్నారని, ఇప్పటికైనా గిరిజన గ్రామాలకు శాంక్షన్ అయిన రహదారులను వెంటనే నిర్మించాని డిమాండ్ చేశారు. విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. హోం మంత్రి అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అల్లూరు జిల్లా పివిటిజి సంఘం అధ్యక్షులు కె.వెంకటరావు, దాయిత్తి పివిటిజిల సంఘం అధ్యక్షులు కొండబాబు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు ?

పోస్టు కార్డులతో కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు పథకం నేటి వరకు అమలు కాకపోవడాన్ని ప్రశ్నిస్తూ గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యాన విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ వేదికగా ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు రాసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు (హాసిని వర్మ) మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారని, అది నేటి వరకు ఎందుకు అమలు చేయలేదని అడిగారు. ఇదే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పోస్ట్ కార్డులు ద్వారా ప్రశ్నించే కార్యక్రమాన్ని కాంగ్రెస్ చేపట్టిందన్నారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు పిరిడి భగత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, సీనియర్ నాయకులు సవరవిల్లి రామకృష్ణ, డిఎస్ఎస్‌వి.వర్మ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, బాషా, పడాల రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గోదావరిలో బోటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-దేవీపట్నం

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గోదావరి నదిలో బోటింగ్ కార్యకలాపాలపై దేవీపట్నం మండలం, పి.గొందూరు గ్రామం, గండిపోచమ్మ బోటింగ్ పాయింట్ వద్ద ఈ నెల 25న శుక్రవారం ఉదయం 10 గంటలకు అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గోదావరి నదిలో బోటింగ్ కార్యకలాపాలు చేపట్టినప్పుడు ఏవిధమైన భద్రత చర్యలు పాటించాలో, హఠాత్తుగా ఏమైనా ప్రమాదం సంభవిస్తే ప్రమాదానికి గురైనవారిని ఎలా రక్షించాలో వంటి అంశాలపై రాష్ట్ర విపత్తు సహాయకదళం వారిచే మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బోటు యజమానులు, రెవిన్యూ, పోలీస్, అటవీ, అగ్నిమాపక, ఇరిగేషన్, మత్స్య, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నల్లబ్యాడ్జీలతో 108 సిబ్బంది నిరసన

ప్రజాశక్తి-కొయ్యూరు

తమ బకాయి ఉన్న జీతాలు చెల్లించాలని కోరుతూ మూడు రోజులు నిరసన కార్యక్రమాల్లో భాగంగా గురువారం 108 ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలు నుంచి వేతనాలు చెల్లించడం లేదని, అరబిందో సంస్థ వచ్చినప్పటి నుంచి ప్రతి నెల జీతభత్యాలు ఆలస్యం చేస్తూనే వస్తుందని తెలిపారు. 2020 నుంచి 2024 వరకు ఏ నెలా సరైన సమయానికి జీతం ఇచ్చిందని లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అత్యవసర పరిస్థితుల్లో ఆదుకునే 108 సిబ్బందికి జీతాలు చెల్లించకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకుంటామని ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ బాధలను అర్థం చేసుకొని అధికారులు స్పందించి తక్షణమే జీతాలు చెల్లించాలని కోరారు.

రబ్బర్ రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఏజెన్సీలోని రబ్బర్ రైతులను ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. గురువారం మారేడుమిల్లి మండలం పందిరిమామిడి కోట గ్రామంలోని రబ్బర్ రైతులతో ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ మారేడుమిల్లి, వై.రామవరం మండలాల్లో రబ్బరు సాగుకు అనువైన ప్రాంతంగా గుర్తించడం జరిగిందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు ఐటీడీఏ ద్వారా రబ్బర్ మొక్కలను అందజేయడం జరిగిందని చెప్పారు. ఎంతమంది దరఖాస్తు చేసుకున్న వారికి రబ్బర్ మొక్కలు సరఫరా చేసే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రబ్బర్ మొక్కలు వేసుకున్న రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా రబ్బర్ మొక్కలు సంరక్షణ కొరకు కూలి పనులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. రబ్బర్ మొక్కల సాగుపై గిరిజన రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం రబ్బర్ పాలు ద్వారా ఏ విధంగా ప్రాసెస్ చేస్తున్నారో పరిశీలించారు. ప్రాజెక్ట్ అధికారి వారి వెంట ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి చిట్టిబాబు, పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, గొర్లె అనిల్ ప్రసాద్, రబ్బర్ రైతులు పాల్గొన్నారు.

సర్పంచులు తప్పడు ప్రకటనలు మానుకోవాలి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం వంచల, జెర్రిల, మొండిగెడ్డ, పంచాయతీల సర్పంచులు తమ సొంత సొమ్ముతో గుంతలు పూడ్చామని పత్రికల్లో తప్పుడు ప్రకటన చేయడం వాస్తవం కాదని జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి.విష్ణుమూర్తి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మోటార్ ఫీల్డ్ సభ్యులు వద్ద వసూలు చేసిన డబ్బులతో జెర్రిల -పశువుల బంధ మధ్య రహదారిలో గుంతలను ఆయా పంచాయతీల సర్పంచులు పూడ్చి వేసినట్లు పేర్కొన్నారు. తప్పుడు ప్రకటనలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని వారి తీరు మార్చుకోవాలని హితవు పలికారు. గత ప్రభుత్వంలో పంచాయతీ నిధులతో కనీసం బ్లీచింగ్ కొనుగోలు చేసే వాళ్లు కాదని విమర్శించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి. విష్ణుమూర్తి, నాయకులు గుండ్ల. రఘువంశి, పి.ఈశ్వరరావు, బి. రాజబాబు ఏ. కొండబాబు టిడిపి నాయకులు పి .బాబురావు ఎల్.మత్స్యరాజు, గణేష్, కే .రామచంద్రరావు బి. సత్తిబాబు ద్విచక్ర వాహన దారులు, ఆటో యూనియన్ సిబ్బంది రీముల బుజ్జిబాబు, బాలకృష్ణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఎఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి -వై రామవరం : వై.రామవరం పోలీస్ స్టేషన్‌ను చింతూరు ఏఎస్‌పి పంకజ్ కుమార్ మీనా గురువారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందితో సమావేశమయ్యారు. స్టేషన్ భద్రత తదితర అంశాలపై ఆరా తీశారు. మావోయిస్టు కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని సూచించారు. సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల సీఐ మూర్తి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-కొయ్యూరు : తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఈ నెల 26 నుండి నిర్వహించనున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని కొండగోకిరిలో గురువారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 26 నుండి మండలంలోని 33 పంచాయతీల్లో పార్టీ గ్రామ ఇన్‌ఛార్జులు, బూత్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సభ్యత్వ రుసుము రూ.100 చెల్లించాలని, సభ్యత్వం తీసుకున్న వారు ఏ కారణం చేతనైనా చనిపోతే రూ.10 లక్షలు బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌ఛార్జులు లోతా సింహాచలం, ఏలూరి రత్నం పాల్గొన్నారు.

రేపు మాజీ ఎమ్మెల్యే దేముడు వర్ధంతి

ప్రజాశక్తి-కొయ్యూరు : చింతపల్లి మాజీ ఎమ్మెల్యే, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు గొడ్డేటి దేముడు 9వ వర్ధంతి ఈ నెల 26న ఆయన స్వగ్రామమైన వెలగలపాలెంలో నిర్వహిస్తున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి ఇరవాడ దేముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ, అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, దేవుడు అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.